# వట్టి అనుమానం మనిషి

పద్మకి ఆ రోజు ఎందుకో నిద్రపట్టలేదు. లేచి పక్క మీద కూర్చున్నది. గడియారం కేసి చూచింది. రాత్రి పన్నెండు గంటల అయిదు నిముషాలు – పక్కన పిల్లలు, ఒళ్ళు మరిచి నిద్రపోతున్నారు. పెద్దది సువర్చల, నాలుగేళ్ళది. చిన్నవాడు బాబు–మొన్న భాద్రపద మాసానికి రెండేళ్ళు దాటాయి. సువర్చల ముసుగు, ఒక పక్కకి తొలిగివుంది. పద్మ ముసుగు అమర్చింది. బాబుకి ఏదైనా కల వచ్చిందేమో? పెదవులు పిండుకొంటూ, ఏడుపు మొహం పెట్టాడు బాబు. పద్మ, బాబుని చిచ్చు కొట్టింది. కళ్ళపైన పడుతున్న బాబు ముంగురులని చెవుల వెనక్కి సద్దింది. నెమ్మదిగా పక్క మీద నించి లేచి, అడుగులో అడుగు వేసుకుంటూ రామకృష్ణారావు పడకగదివేపు వెళ్ళింది. గది గుమ్మంలోంచి లోపలికి తొంగి చూచింది. రామకృష్ణారావు గుర్రు పెడుతో, హాయిగా నిద్ర పోతున్నాడు. ఎంత కాలమైంది తను ఆ గదిలోకి వెళ్ళి? దాదాపు ఆరు మాసాలైనా అయివుంటుంది. ఎందుకో అమాంతంగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి పద్మకి–కొంగుతో కన్నీళ్ళు వొత్తుకుంటూ పక్క గదిలోకి వెళ్ళింది. రెండు మామూలు చీరలూ రెండు జాకెట్లూ, కొయ్యకి వున్న చేతి సంచిలో పడేసింది. మెళ్ళో వున్న బంగారు గొలుసు తీసి తన పెట్టెలో భద్రపరచింది. మెడ బోసి అయి వెల వెల పోయింది. తన వంటిపైన ఏ నగలూ లేకుండా చూచుకుంది. తను కాపు

రానికి వచ్చి ఆరు సంవత్సరాలైంది. అప్పటికి తనకి పద్దెనిమి దేళ్ళు దాటాయి — పంథొమ్మిదవ ఏడు నడుస్తున్నది. తను బి. ఏ. ప్యాసైన సంవత్సరమే తనకు వివాహం జరిగింది. తను ఆ ఆరు సంవత్సరాలు ఆ ఇంట్లో ఘూడిగం చేసింది. యమ యాతన అనుభవించింది. అపనిందలపాలైంది. అవమాన భారంతో కృంగిపోయింది. వీటన్నిటికీ ఫలితం, రెండు చీరెలు, రెండు జాకెట్లునూ! అవికూడా పాతవే — ప్రపంచంలోని అన్ని వృత్తుల్లోకల్లా భార్యావృత్తి ఎంతో చౌకగా కనపడింది పద్మకి — రెండు పూటలు కూడు పడేసి సంవత్సరానికి రెండు చీరలూ, రెండు జాకెట్లూ మొహాన కొడితే చాలు—"భార్య" అనే జీవచ్ఛవం లభిస్తుంది. ఇరవై నాలుగు గంటలూ ఘూడిగం చేస్తుంది. "భర్త" అనే యజమానిని సుఖపెడుతుంది— తన్నులు తింటుంది. తిట్లు భరిస్తుంది. పుట్టెడు అవమానాలకి తల ఒగ్గుతుంది. ఇంత చౌకగా ఏ యజమానికి ఏ పని మనిషి లభిస్తుందని? ఒకవేళ, లభించినా తినరానితిట్లు ఎందుకు తింటుందని? పడరాని తన్నులు ఎందుకుపడుతుందని? లేనిపోని అవమానాలకి ఎందుకు గురిఅవుతుందని? వెంటనే ఉద్యోగంచాలించుకుంటుంది. ఎదురు తిరుగుతుంది. "సీ" వంటే "సీ" వంటుంది. కాని "భార్య" అనే పదార్థం అల్లా చేయడానికి వీలులేదు. అది పతివ్రతా ధర్మానికి విరుద్ధం. అందులో భారతావని, సీతా సావిత్రుల వంటి మహా పతివ్రతల్ని కన్న పుణ్యభూమి. ఆ పావన చరిత ఒడిలో జన్మించి, భార్యా వృత్తిని వదులుకోవడమే? భర్తని వదలి వేయడమే? రౌరవాది నరకం ప్రాప్తిస్తుంది. కాని ఆ రౌరవాది నరకం కన్నా, ప్రస్తుతం తను అనుభవిస్తున్న నరకమే భయంకరంగా తోచింది పద్మకి—

అందుకోసమే ఆమె రామకృష్ణారావుని వదిలివేయడానికి నిశ్చయించుకుంది.

తన తలిదండ్రులు రామకృష్ణారావు ఆస్తి మాత్రమే చూచారు. కాని అతని గుణ సంపత్తిని పరికించలేదు. అతనికి మంచి భూవసతి వుంది. నగరంలో ఒక ఇల్లు వుంది. పైగా ఉద్యోగం కూడా చేస్తున్నాడు, పెండ్లికొడుక్కి వుండవలసిన లక్షణాలన్నీ అతనిలో కనపడ్డాయి తన తల్లిదండ్రులకి. వెంటనే సంప్రదింపులు ప్రారంభించారు. కట్నం దగ్గర పేచీ వచ్చింది. ఆరువేలు యివ్వమని పెళ్ళికొడుకు తరపు వాళ్ళు, నాలుగు వేలిస్తామని తన తలిదండ్రులూ బేరసారాలు ప్రారంభించారు. తను తలిదండ్రులకి ఒక్కతే కూతురు — అల్లారు ముద్దుగా పెంచారు. వాళ్ళ దృష్టిలో మంచి సంబంధం వచ్చినప్పుడు, ఎల్లా వదులుకుంటారని? అయిదువేలకి వ్యవహారం పరిష్కారం చేశారు. కలిగిన యింటికి వెడితే, తమ కూతురు సుఖపడుతుందనుకున్నారు. కాని తన జీవితం అధోగతి పాలవుతుందని వాళ్ళు కలలోనైనా ఊహించలేదు. పెళ్ళికొడుకు చదువుకున్నవాడు — అందువల్ల యోగ్యుడే అయివుంటాడని వాళ్ళు భావించారు. కాని అతనిని అనుమానపిశాచ మావహిస్తుందని కానీ తత్ఫలితంగా తమ కూతురు జీవితం దుఃఖ భాజనం అవుతుందనికాని వాళ్ళు ఏకోశానా అనుకోలేదు.

తనకి ఈ సంబంధం నిశ్చయమవుతున్న రోజుల్లో, ఒక రోజున తన మేనత్త వెంకటలక్ష్మమ్మ వచ్చి తనని ఆమె కొడుకు పేర్రాజు కివ్వమని తన తండ్రిని నిలేసి అడిగింది. పేర్రాజు అప్పటికి ఎం. ఏ. ప్యాసయినాడు. యూనివర్సిటీలో లెక్చరర్‌గా కుదిరాడు. బుద్ధిమంతుడు కాగా చిన్నప్పటి

నుంచీ తనతో ఎంతో చనువుగా ఉండేవాడు. కాని తన మేనత్త వాళ్లకి ఏ మాత్రం ఆస్తి లేదు. కాగా ఆస్తి విషయంలో వాళ్ళు తన హోదాకి తగినవాళ్ళు కారని, తన తండ్రికి లోలోపల గర్వం. అందువల్ల 'చూతాము లెమ్మ'ని తన తండ్రి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. 'ఇద్దరూ ఎదిగి వచ్చారు. మంచి ఈడూ జోడూ గల సంబంధం కాగా ఒకరంటే ఇంకొకరికి ఇష్టం' అని వాదించి చూచింది వెంకట లక్ష్మమ్మ. 'దగ్గరి సంబంధం వదులుకోవడం శ్రేయస్కరం కా'దని కూడా నొక్కి చెప్పింది. దానితో మాటా మాటా పెరిగాయి. 'నీ కొడుకుకి తప్పక నా కూతురిని ఇస్తానని పత్రం వ్రాసి ఇచ్చానా?' అని అడిగాడు తన తండ్రి వెంకటలక్ష్మమ్మని పట్టరాని కోపంతో. వెంకట లక్ష్మమ్మకి కూడా బాగా కోప మొచ్చింది. 'నీ కూతురిని నా కొడుకివ్వకపోతే, ఇంక నీ ఇంట్లో అడుగుపెట్ట'నని నిష్ఠూరమాడింది. దానితో ఆ రెండు కుటుంబాల మధ్య గల సంబంధ బాంధవ్యాలు తెగతెంపులైనాయి. తన మేనత్త వాళ్ళెవ్వరూ తన పెళ్ళికి రాలేదు. అది చూచి తన తల్లి కంట తడిపెట్టింది. కాని తన తండ్రి లక్ష్యం చెయ్యలేదు. నిజమే దగ్గరి సంబంధం వదులుకోవడం, తనకి శ్రేయస్కరంగా పరిణమించలేదు. తన మేనత్త మాటలు అక్షరాలా నిజమైనాయి. తను పేరాజుని పెళ్ళి చేసుకుంటే ఎల్లా ఉండేదో? అప్పుడు తన జీవితం సుఖప్రదంగా ఉండేదేమో? 'చచ్చిన బర్రె పగిలిన కడివెడు పాలిచ్చే' దన్నట్లు ఉంది తన ధోరణి.

అప్పట్లో తను పేరాజుని ప్రేమించిందని కాదు. ప్రేమంటే ఏమిటో తనకి ఆ నాటికి ఈ నాటికీ తెలియదు.

ఎందుకో అతనంటే చిన్నప్పటినుంచీ తనకి ఇష్టం. అతను గంటల తరబడి ఏవో కబుర్లు చెప్పేవాడు. అతన్ని ఏడిపిస్తూ మధ్య మధ్య ఏవో ఆక్షేపణలు చెబుతూ ఆ కబుర్లు తను శ్రద్ధగా వినేది. మధ్య మధ్య అతన్ని ఉడికించేది. ఆ రోజుల్లో చిలిపి చేష్టలు చేయడమంటే తనకి ఎంతో సరదా — ఒకనాడు తాంబూలంలో కారం వేసి కట్టి ఇచ్చింది. అతను చూచు కోకుండా తాంబూలం నోట్లో వేసుకున్నాడు. కారం నసాళానికి అంటింది. అతను చిందులు తొక్కడం ఆరంభించాడు. కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి. అతని దురవస్థ చూచి తనకు పట్టలేని నవ్వు వచ్చిది. తను ఒకటే పనిగా నవ్వడం — అతను ఒకటే పనిగా కోప్పడడం ఇదీ వరస. ఇంకొకసారి తను కాఫీలో బొగ్గుపొడి కలిపి అతనికి ఇచ్చింది. అమాయకంగా ఒక గుక్కెడు కాఫీ తాగాడు. నోరంతా బొగ్గు బొగ్గు అయింది. దానికి అతను తిట్ల వర్షం కురిపించాడు. ఆ తిట్లకి జవాబుగా తను గొల్లున నవ్వింది. ఎంత అమాయకమైన రోజు లవి. 'ఆ రోజులు మళ్ళీ వస్తాయా?' అనుకుంది పద్మ బేలగా. రావని తెలుసు. అయినా ఎందుకో కోరుకుంటాం. అది మానవనైజం. పద్మ ఎంతోకాలం అతన్ని ఉడికించింది. సరదాగా ఎంతో వేధించుకున్నది. కాని ఎన్నడూ అతన్ని పెళ్ళి చేసుకుందామనుకోలేదు. ఎందుకో ఆ వేపే పద్మ దృష్టి వెళ్ళలేదు. మేనత్త వచ్చి నిష్ఠూరా లాడి వెళ్ళిన తరువాత కూడా. రెండు కుటుంబాలకి తెగతెంపులైన వని తను విచారించ లేదు. తల్లిగారి ఇంట్లో తను ఎంతో ఆరోగ్యంగా బతికింది. కాని అత్తగారి ఇంట్లో అడుగు పెట్టడంతోనే జీవితంలో కుళ్ళు ప్రవేశించింది. ఆ కుళ్ళుని కడిగి వేసుకోవడం

కోసం ప్రస్తుతం తను మహత్తర త్యాగాన్ని చేయవలసి వస్తున్నది.

ఆ కుళ్ళు తన జీవితంలో ఎలా ప్రవేశించిందో తలుచుకుంటేనే పద్మకి ఒళ్ళు జలదరించింది. తను కొత్తగా కాపురానికి వచ్చిన రోజులవి. కుటుంబ మనస్పర్థలన్నీ దిగమ్రింగి, ఒకనాటి సాయంత్రం, పేర్రాజు తమ యింటికి వచ్చాడు. తను వాకిలి గుమ్మంలో మల్లెపూలు కొంటున్నది. అతన్ని చూడడంతోనే, తన హృదయం ఎగిరి గంతు వేసింది. అత్తగారింట్లో కొత్తగా కాపురం చేస్తున్నప్పుడు తల్లిగారింటి కాకి కనపడినా ఎంతో సంతోషంగా వుంటుంది ఆడపిల్లలకి—తనకి యిష్టుడైన మనిషి కనపడడంతో తను యుక్తాయుక్తాలు మరిచింది. పూలుకొనడం మానేసింది. నవ్వుతో పేర్రాజుకి ఎదురుగా వెళ్ళి, రెండు చేతుల్ని అందుకొని, యింట్లోకి లాక్కొచ్చింది. రామకృష్ణరావు ఆ దృశ్యాన్ని కళ్ళారా చూచాడు. పేర్రాజు చేతులు విడువకుండానే అతన్ని తన భర్తకి పరిచయం చేసింది. అందులో తనకి తప్పేమి కనపడలేదు. కాని తన భర్త మొహం ముడుచుకోవటంతో తను చేసినపని భర్తకి కోపకారణమైందని గ్రహించింది పద్మ. వెంటనే పేర్రాజు చేతులు వదిలివేసింది. ఇంకానయం ఇంట్లో అత్తమామలు లేరు. రెండు రోజుల క్రితమే ఊరికి వెళ్ళిపోయారు. లేకపోతే, వాళ్ళకికూడా తన భర్తకిమల్లె కోపంవచ్చివుండేదే. ఏ దుర్ముహూర్తాన ఈ సంఘటన జరిగిందో, అప్పటినించే తన భర్త తన శీలాన్ని శంకిస్తున్నాడని, కొన్ని రోజుల తరువాత కాని తెలిసి వచ్చింది కాదు పద్మకి. — ఒక రోజున ఏవో మాటల సందర్భంలో అమాయకంగా తను పేర్రాజువాదాన్ని

బలపర్చింది. తన భర్తని ఖండించింది, న్యాయం ఎవరిపట్ల వుంటే, వాళ్ళ వేపు మాట్లాడాలని, తను మొదటినించీ నేర్చుకున్నది. కాని, తన పరభేదాలు పెట్టుకోని మాట్లాడడం అవసరమని ఆ నాడు తనకు మొదటి సారిగా తెలిసి వచ్చింది. ఈ రెండు సంఘటనలు తప్ప, తన భర్త తనని అనుమానించ డానికి ఎట్టి అవకాశాలు కలుగ లేదు. ఆ విధంగా ప్రవర్తించ డంలో తన కేమీా తప్పు కనపడ లేదు. తను సహజంగానే ప్రవర్తించానని భావించింది. కాని తన భర్త దీనికి పూర్తిగా విరుద్ధంగా అభిప్రాయ పడినట్లు కనపడుతుంది. లేకపోతే ఆ చిన్న సంఘటనల్ని గూర్చి అతను అంత గొప్ప వ్యాఖ్యానాలు చేయడ మేమిటి, ఆ మనస్పర్థలేమిటి? తన భర్త ధోరణి కూడా అతివిచిత్రంగా వుంటుంది. కాలుకు పెడితే, మెడకు పెడుతాడు. మెడకి పెడితే కాలికి పెడుతాడు బంధం. వితండ వాదానికి అత నిది పెట్టింది పేరు. అతనితో వాదించి గెలు వడం అసాధ్యం. ఎంత మహాతార్కికులైనా, అతనికి జోహార్లు అర్పించవలసిందే. ముక్కు సూటిగా ఎన్నడూ మాట్లాడడు. ప్రతి విషయాన్ని డొంక తిరుగుడుగా ప్రవేశపెడుతాడు. అతని ప్రతి వాక్యం హృదయానికి సూటిగా గుచ్చు కుంటుంది; అమితంగా బాధ పెడుతుంది. ఎదుటి మనిషిని హింసించడ మంటే, అతనికి సరదాఅనుకుంటాను. లేకపోతే ఎంతహృదయం విప్పి చెప్పినా, ఏ ఒక్క విషయాన్ని అతను నమ్మకపోవడ మేమిటి? ఎంతకి తన ధోరణి మార్చుకోక పోవడమేమిటి? అతనిది సంకుచిత హృదయమైనా కావాలి. లేకపోతే, హింసించే స్వభావమైనా కావాలి. తనకీ, తన భర్తకి మన స్పర్థలు పెరగడానికి ముఖ్య కారణం ఇంట్లో పెద్ద దిక్కులేక

పోవడమే. తన అత్తమామలు ఎప్పుడో వస్తారు. రెండు రోజులుండి వెళ్ళి పోతారు. ఇంట్లో వాళ్ళు ఎల్లప్పుడూ వుండక పోవడం వల్ల తన భర్తకి ఆడిందే ఆటగా వుంది; పాడిందే పాటగా వుంది. దీనికంతకి ఫలితం, తను అనుభవించాల్సి వస్తున్నది.

"పద్మా! మధ్యాహ్నం నా కోసం ఎవరైనా వచ్చారా?"

"లేదండీ. ఎవ్వరూ రాలేదు."

"పోనీ, నీకోసం?"

"అదేమిటండీ? అలా మాట్లాడుతారు నా కోసం ఎవరు వస్తారని."

"నీ స్నేహితు లెవరైనా వచ్చి ఉండకూడదా?"

"నాకు స్నేహితు లెవరున్నారండీ మనింటికి రావడానికి?"

"ఏమో, నా కేం తెలుసు?"

"ఎవరైనా మీ మాటలు వింటే నవ్వి పోతారు సుమండీ"

"నవ్వడమా? నవ్వడ మెందుకు? నిజమైన విషయానికి."

"నిజ మేమింటడీ?"

"నీ స్నేహితులు రావడం."

"మళ్ళీ మొదలా?"

"అప్పుడప్పుడు మనింటికి పేరాజు వచ్చి పోవడంలేదు?"

"వస్తే?"

"అందు కోసమే నీ స్నేహితు లెవరైన వచ్చారా అని అడిగాను."

"అతనికి, నాకూ సంబంధ మేమిటండీ?"

"ఏమో, నాకెల్లా తెలుస్తుంది?"

"లక్షసార్లు నాతో ప్రమాణాలు చేయించుకున్నా, మీకు ససేమిరా అనుమానం తీరదు. దానికి నేనేమి చెయ్యాను చెప్పండి?"

"మ రెందుకొస్తాడతను, ఊరికే మనింటికి?"

"బంధుత్వ రీత్యా."

"అతనికీ, నాకూ బంధుత్వ మేమిటీ అంట?"

"మీకు లేక పోవచ్చు, కాని నాకు మాత్రం వుంది."

"అందుకోసమే నీ కోసం వస్తాడని నే ననడం."

"నా కోసం రావడ మేమిటండీ, నా బాగోగులు విచారించడానికి వస్తాడు. అంతే."

"ఏ సాకుపైన వస్తే ఏం? రావడం ప్రధానం కాని."

"అయితే, ఈ మాటు వచ్చినప్పుడు అతన్ని మనింటికి రావద్దని చెప్పండి?"

"మీరు మీరు బాగానే వుంటారు మధ్య నేను చెడు పేరు తెచ్చుకోవడ మెందుకు?"

"మరి నే నెల్లాగా చెప్పేదండీ?"

"అయితే ఎవరు చెప్పా లింతకీ?"

"మీరు."

"ఇంతకీ నువ్వు చెప్పదలుచుకో లేదన్న మాట?"

"ఏ నోరు పెట్టుకొని చెప్పనండీ, నువ్వు మా ఇంటికి రావద్దని?"

"అదంతా నాకు తెలియదు. అతను మాత్రం మనింటికి రావడానికి వీలులేదు."

"నాపైన మీకు ఇంత అనుమానం దేనికండీ?"

"పోనీ, నా అనుమానం పోగొట్టడానికే అనుకో, ఈ మాటు అతన్ని మనింటికి రావద్దని చెబుతావా?"

"ఇకనించీ నాపైన ఎట్టి అనుమానాలు పెట్టుకోకుండా వుంటే అలాగే చెబుతాను."

"నిజంగా అతనికీ నీకూ ఏమీ సంబంధం లేదా?"

"మళ్ళీ మొదలా – పోనీ ఎల్లా చెబితే నమ్ముతారో చెప్పండి.?"

"నీకూ అతనికీ ఏమీ సంబంధం లేదని నా పాదాలు పట్టుకొని ప్రమాణం చెయ్యి."

"ఇదిగో మీ పాదాల సాక్షిగా నాకూ అతనికీ ఎట్టి సంబంధం లేదు."

"పద్మా! నిజంగా నీ మాట నమ్మనా?"

"ఎల్లా ప్రమాణం చేసినా మీకైతే అనుమానం తీరదు. ఇక నమ్మితే నమ్మండీ, లేకపోతే మానుకోండి."

"నేను చనిపోతే నీకేం లెద్దూ?"

పద్మకి యీ సంభాషణ జ్ఞాపకంవచ్చి, కళ్ళల్లోంచి నీళ్ళు జలజల రాలాయి. ఏ భార్య తనభర్త చనిపోవాలని కోరుకుంటుంది? రామకృష్ణారావు ఆ రోజున అంత కఠినంగా ప్రవర్తించినందుకు, పద్మ హృదయం తల్లడిల్లింది.

ఇది ఒక్కటే సంఘటనకాదు. ఇల్లాంటివి అనేక సంఘటనలు జరిగాయి. రామకృష్ణారావు ప్రతిసారీ, పద్మతో బలవంతంగా ఏదో ప్రమాణం చేయించుకోవడం, తీరాచేసిన తరువాత అసలు విషయం నమ్మకపోవడం, అనేకసార్లు జరిగింది. పద్మకి ఈ అవమానకరమైన బ్రతుకుతో విసుగెత్తి

పోయింది. ఎంత ఆలోచించినా, సమస్యా పరిష్కారమేమీ కనపడలేదు. మొదట కొన్ని రోజులు రామకృష్ణారావుతో మాట్లాడడం మానివేసింది. దానివల్ల ఏమీ లాభం లేక పోయింది. మనస్సులు కలవకపోయినా, దైహికంగా ఆమె మొదటినుంచీ లొంగుతూనే వచ్చింది. తనూ మంచి యౌవనంలో వుంది. తన భర్త తనని నిండు కోరికతో సమీపిస్తే ఎన్ని మనస్పర్థలున్నా ఎల్లా కాదనగలుగుతుంది? ఒకనాడు ఎదిరించినా, ఇంకొకనాడు భర్తకి లొంగిపోక తప్పిందికాదు. ఉభయులకీ మనస్సులు కలవకపోయినా, హృదయాలు ఏకం కాకపోయినా, యిద్దరు పిల్లలు పుట్టారు. మనోవైషమ్యాల మధ్య పుట్టిన పిల్లలు. ఎల్లావుండాలో వాళ్లూ అల్లాగేవున్నారు. పిల్లలకి తలిదండ్రుల మంచి పట్టుబడడం కష్టం. కాని చెడు ఇట్టే అంటుకుంటుంది. తండ్రి చెడుగుణాలు, తన పిల్లల్లో మూర్తీభవించి వున్నట్లు తోచింది పద్మకి. ఎవ్వరి మాటా వినరు. ఎంతో పెంకెతనం చేస్తారు. ఏ విషయం కూడా వాళ్ళకి నచ్చచెప్పడం కష్టం. గుడ్డెద్దు చేలోపడ్డట్టుగా వాళ్ళకి తోచిందేదో చేస్తారు. దానికి విరుద్ధమైనది, ఏదో సవ్యమైన మార్గం వుంటుందని కూడా ఆలోచించరు. తాము పట్టిన కుందేటికి మూడే కాళ్ళని తండ్రిలాగా మొండిగా వాదిస్తారు. క్రమశిక్షణ లేదు. తండ్రి వాళ్ళని ఏ మాత్రం ప్రేమించడు. దగ్గరికి తీసుకోడు. ఏ ముద్దూ ముచ్చటా తీర్చడు. ఒకవేళ వాళ్లూ దగ్గరికి వెళ్ళినా కసిరి కొడుతాడు. తన పిల్లలు కారేమోనని అతని అనుమానం. ఆ అనుమానానికి అనుగుణంగా వాళ్ళతో విముఖంగా ప్రవర్తించడం మూలాన, వాళ్ళకు తండ్రి అంటే తనసుమల్లైనే ఎందుకో గిట్టదు. తండ్రి

గుణాలు కనపడినప్పుడల్లా, తనూ పిల్లల్ని చూచి అస హ్యించుకుంటుంది. కాని తనది తల్లి హృదయం కనక, ఆ అసహ్యాన్ని లోలోపలనే మరుగు పరుచుకుంటుంది. దీనికి ఫలితంగా పిల్లలు రెండింటికీ చెడిన రేవడులు అవుతున్నారు. అటు తండ్రి ప్రేమకు దూర మైనారు. ఇటు తల్లి ప్రేమనీ తగి నంతగా పొంద లేక పోతున్నారు. తను ఎప్పుడైనా దయదలచి దగ్గరికి తీసుకుంటే కద్దు. లేకపోతే లేదు. దారం తెగిన గాలి పటాలకి మల్లే ఆకుకు అందకుండా పోకకు పొందకండా పోతున్నారు.

టైం ఎంత అయిందో? తన ఆలోచనల్లో నాలుగు కాలేదు గదా? వెంటనే పెట్టె తాళం వేసింది పద్మ. దిగ్గున లేచింది. చేతి సంచితో చరా చరా తన పడక గదిలోకి తిరిగి వచ్చింది. గడియారం వంక చూసింది. ఇంకా రెండు న్నర కాలేదు. రెండు నిమిషాలు తక్కువ ఉంది. ఇరువై మూడు నిమిషాల్లో తను తన ఇరవై నాలుగు సంవత్సరాల జీవితాన్ని అక్కడక్కడ తడిమి చూసుకుంది. కొన్ని సంఘ టల్ని సుదీర్ఘంగా జ్ఞాపకం చేసుకున్నది. కొన్నిటిని పిట్ట చూపుగా చుట్టి వచ్చింది. అయినా ఇరవై మూడు నిమిషాలు మాత్రమే అయింది. తన మనస్సు పరుగెత్తినంత వేగంగా కాలం పరుగెత్తనందుకు పద్మ ఎంతో విచారించింది. నాలుగు గంటలకి కాని, పేర్రాజు తన కోసం టాక్సీ తీసుకొని రాడు. ఇంకా గంటన్నర వ్యవధి ఉంది. ఈ గంటన్నర ఎలా గడప టమా అని పద్మ ఆలోచించింది. పోనీ కాసేపు నడుము వాలిస్తే? కునుకు పట్టి సమయానికి లేవలేకపోతే, చేసిన ప్రయత్నమంతా వృథా అవుతుంది. చివరకి తనకీ యము

కూపమే మిగులు తుంది. పని మనిషి మూడు రోజులు పట్నమంతా గాలిస్తేనే కాని పేర్రాజు దొరక లేదు. తను రావడన్నప్పటినించి తమ ఇంటికి రావడం కూడా మాని వేశాడు. అభిమానధనుడు. అతను లోగడ ఎక్కడో బస్తీలో ఉంటానని చెప్పాడు. తన కేవో రెండు మూడు వీధులు జ్ఞాపకం వచ్చాయి. ఫలాన వీధి అని నిక్కచ్చిగా జ్ఞాపకం రాలేదు. తనకి జ్ఞాపకం వచ్చిన రెండు మూడు వీధులూ, రోజుకి ఒక వీధి చొప్పున పని మనిషిని తిప్పింది. అదృష్టవశాత్తూ అతను మూడవ రోజున పని మనిషికి దొరికానాడు. అతను కనపడితే నేరుగా తమ ఇంటికి కాక పక్క వీధిలో తన క్లాస్ మేటు ఇందిర ఇంటికి తీసుకు రమ్మని చెప్పింది. ఇందిర బి. ఏ. లో తన సహాధ్యాయని. ఆమె భర్త సెక్రెటేరియట్ లో పని చేస్తున్నాడు. ఆమెని ఒక రోజు పిలిపించి తన కష్టాలన్ని చెప్పుకొని, తనకి సహాయం చేయమని కోరింది. ఆమె చేతనైనంత సహాయం చేయడానికి అంగీకరించింది. ఆ క్రితం రోజున పేర్రాజు పని మనిషికి కనపడ్డాడు. పని మనిషి ఇందిర ఇంట్లో పేర్రాజుని దిగబెట్టి తనకి ఆ కబురు అంద జేసింది. పిల్లల్ని పక్క ఇంట్లో అప్పజెప్పి తను ఇందిర ఇంటికి వెళ్ళింది.

పేర్రాజుని ఇందిర ఇంట్లో రహస్యంగా కలుసుకున్నది. సంగతి సందర్భాలు వివరించి చెప్పింది. "అతనికీ నీపైనే అనుమానం వుంది కనుక నీతోనే లేచివచ్చి అతనిపైన కసి తీర్చుకుంటాను" అని చెప్పింది. మొదట పేర్రాజు ఎంతకీ అంగీకరించ లేదు. "నువ్వు నాకు ఆశ్రయ మివ్వకపోతే ఏ నుయ్యోగొయ్యో చూసుకుంటాను" అని పద్మ బెదరించినది.

దానికి అతను జంకలేదు. "లేచిపోయిందనే అపనిందపాలు కావడానికి బదులు ఏనుయ్యో గొయ్యో చూసుకోవడమే ఉత్తమ''మని సలహా యిచ్చాడు. "అతని దృష్టిలో నేను ఇదివరకే ఒక కులటని. ఈ చర్యవల్ల కొత్తగా ఏమీ అప నిందల పాలుకావడం లేదు''అని నచ్చజెప్పటానికి చూసింది. "నీ భర్త దగ్గర వుండడం నీకంతగా యిష్టం లేకపోతే నీ పిల్లల్ని తీసికొని నీ పుట్టింటికి వెళ్ళమని'' హితవు ఒసగాడు. చివర ప్రయత్నంగా పద్మ అతని కాళ్ళమీద పడి ఏడ్చింది. "నా దుస్థితి గూర్చి నేనింతవరకూ పుట్టింటిలో ఎవరికి చెప్ప లేదు. ఇక ముందుకూడా చెప్పజాల''నని మొర పెట్టుకుంది. పేర్రాజు హృదయం కరిగింది. మొదట కోర్టులో విడాకుల కోసం ప్రయత్నించి ఆ ప్రయత్నం సఫలమయితే ముందు సంగతి ఆలోచించవచ్చు''నని అన్నాడు. మరునాడు తెల్ల వారుఝామున నాలుగు గంటలకి వచ్చి, పద్మని టాక్సీలో తీసుకెళ్ళడానికి వాగ్దానం చేశాడు. మరునాడు ఆ నరక కూపాన్ని వదలుకో గలుగుతున్నందుకు తను ఎంతో సంతో షించింది. ఆపత్సమయంలో తనకి అవసరమైన సహాయం చేస్తుందుకు పద్మ పేర్రాజుకు తన కృతజ్ఞతల్ని తెలిపింది. తన మనస్సులో అతన్ని వేనోళ్ళ శ్లాఘించింది.

ప్రస్తుతం తనతో పిల్లల్ని తీసుకెళ్ళడమా లేక మానే యడమా? అనే సమస్య పద్మ బుర్రలో తలెత్తింది. తీసికెళితే పడుకున్న వాళ్ళని పడుకున్నట్లుగానే తీసుకెళ్ళాలి. వాళ్ళని లేపితే, తన ప్లానుకే ముప్పు వాటిల్లుతుంది. ఇంట్లోంచి కారు దాకా తీసుకెడుతుండగా మధ్యలో లేచినా ప్రమాదమే. ఏ ఒక్క అమ్మాయో, లేక అబ్బాయో అయితే, లేవకుండానే

ఎల్లాగో తీసుకెళ్ళవచ్చు. ఒకరు కాక యిద్దరు పిల్లలు వున్నారు. ఎల్లా తీసుకెళ్ళడమా అని పద్మ ఎంతోసేపు ఆలోచించింది. ఎంత ఆలోచించినా, ఆ పని సాధ్యపడేటట్లు కనపడలేదు. కాగా పెంకి పిల్లలు. తీసుకెడుతుంటే, తీరా మేము రామని వాళ్ళు మొండికేస్తే? పోనీ వాళ్ళని ఇక్కడేవుంచి, తను ఒక్కతే వెడితే ఎలావుంటుంది? ఎందుకో తల్లి హృదయం మొదలు దానికి ఒప్పుకోలేదు. కాని తీరా తీసుకెడితే తమ పెంకితనంతో, తమ తండ్రిని ఎల్లప్పుడూ తనకు జ్ఞాపకం చేయిస్తుంటారు. అది భరింప శక్యంకాకుండా వుంటుంది. తను ఎల్లాగో సరిపెట్టుకోవాలనుకున్నా, రామకృష్ణారావు పిల్లల్ని తీసికెళ్ళి పేర్రాజు నెత్తిమీద కొట్టడం ఏమిన్యాయం? ప్రస్తుతం పేర్రాజు తన మొహంచూచి అభ్యంతరం చెప్పకపోయినా, రానురాను చెప్పకుండా వుంటాడని ఏమి నమ్మకం. కాగా పిల్లల్ని తనతో తీసుకుపోవడంవల్ల ఆ పిల్లలు తన పిల్లలు కారని పూర్వంనుంచీ రామకృష్ణారావుకిగల అనుమానం ధృవపడిపోతుంది. ఆ పిల్లలు, అతని పిల్లలేనని గట్టినమ్మకం కలిగించడం ప్రస్తుతానికి ఎంతైనా అవసరం. పిల్లల భవిష్యత్తు దృష్ట్యాకూడా, వాళ్ళని ఆయింట్లో వదిలివేయడం శ్రేయస్కరం. అందువల్ల పద్మ తనతో పిల్లల్ని తీసుకుపోకుండా వుండటానికి నిశ్చయించుకుంది.

ఇటీవల జరిగిన ఒక సంఘటన జ్ఞాపకంవచ్చి, పద్మకి చల్లగాలికే ముచ్చెమటలు పోసాయి. ఆ సంఘటన జరిగిన వెంటనే, శాశ్వతంగా నరకకూపంలో పడివుండడమో లేక ఆ నరకకూపంనించి బయటపడి గర్వంగా బ్రతకడమో, ఏదో ఒకటి చేయవలసిన తరుణం ఆసన్నమైందని పద్మ గ్రహించింది.

శాశ్వతంగా నరకకూపంలో పడి వుండడం దుస్సహమని తోచింది. వెంటనే పని మనిషిని పంపి పేర్రాజుని వెతికించింది. ఈ సంఘటన జరిగి వుండకపోతే, పద్మ అంత సాహసకృత్యానికి పూనుకొని వుండక పోయేదేమో!

దాదాపు ఎనిమిది రోజుల క్రితం రామకృష్ణారావు ఆఫీసుకి వెళ్ళిందే తడవుగా యింటికి తిరిగి వచ్చాడు. వచ్చీ రావడంతోనే వాకిలు తలుపుదడదడ బాదాడు. తను అప్పుడు అన్నం తింటున్నది. "ఎవ్వరూ" అని అరిచిందేకాని, వెంటనే తలుపు తియ్యలేక పోయింది.

"నేనే తలుపు తియ్యి" అని అరిచాడు రామకృష్ణారావు. పద్మ చెయ్యి కడుక్కొని తలుపు తీసింది.

"తలుపు తియ్యడానికి ఇంత ఆలస్యమెందుకయ్యింది?" అని కస్సు మన్నాడు రామకృష్ణారావు. అతని స్వభావమే అంత అని పద్మ మౌనం వహించింది. పద్మ తలుపు తీసిందే తడవుగా, ఇల్లంతా దేనికోసమో వెతకడం ఆరంభించాడు.

"దేనికోసం మీరు వెతకడం?" అని పద్మ ఏదో మాటవరుసకి అడిగింది.

"అవసరమైన కాగితం ఎక్కడో మరచిపోయాను. దాని కోసం వెదుకుతున్నాను" అన్నాడు రామకృష్ణారావు.

"ఆఫీసులో వుందేమో, సరిగా చూచారా?"

"ఇంట్లో ఎక్కడా కనపడటం లేదు. ఇక మిగిలితే ఆఫీసులోనే వుండాలి."

"ఇప్పుడే వెడుతారా ఆఫీసుకి?"

"నేను వెంటనే వెళ్ళిపోవాలని వుందా నీకు?"

"ఇంత ఎండలో వచ్చి, అప్పుడే వెడుతారా అని అడిగాను. లేకపోతే నాకు మీరు వెళ్ళాలని ఉంటుందా?"

"ఇంతకు ముందే పేర్రాజు ఇటు కేసి రావడం చూచాను, అందువల్ల నీకు ఉంటే ఉండవచ్చు."

"ఈవిధంగా నన్ను ఎందుకు వేపుకుతింటారు చెప్పండి?"

"నేను నిన్ను వేపుకు తినడం ఏముంది దీంట్లో?"

మీకు ఇష్టం లేకపోతే నన్ను వదిలేసెయ్యండి – కాని చీటికి మాటికి నన్నీ విధంగా హింసించకండి."

"నేను వదిలివేస్తే, హాయిగా పేర్రాజుతో కాలక్షేపం చేయవచ్చుననా నీ ఉద్దేశ్యం?"

"ఎవడండీ ఆ పేర్రాజు?"

"భర్త తరువాత భర్త అంతటి వాడు. వాడూ, వీడూ అంటే కళ్ళు పోతాయి."

"నన్ను ఈ రంపపు కోత కోస్తే మీ కేమి ఒరుగుతుంది చెప్పండి?"

"నేను వెళ్ళిన తరువాత ఇటు కేసి పేర్రాజు ఏమైనా వచ్చాడా?"

"రావద్దన్న తరువాత మనింటికి ఎందుకు వస్తాడండీ?"

"నాకు తెలియకుండా రహస్యంగా..."

"....................................."

"మీ రీ మధ్య ఎన్నడూ కలుసుకోలేదూ?"

"ఎప్పుడు కలుసు కున్నామండీ?"

"నాకు తెలియకుండా లక్షసార్లు కలుసు కున్నారు."

"మరి ఎందుకు పట్టుకోలేదు మమ్మల్ని?"

"తెలిస్తే కదూ పట్టుకోవడానికి?"

"నేను కాపురానికి వచ్చి ఆరు సంవత్సరాలైంది. దైవకృపవల్ల ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. ఇంకెన్ని రోజులు అని బ్రతికేది చెప్పండి నేనీ అనుమానం బ్రతుకు."

"ఆ ఇద్దరు పిల్లలూ, నా పిల్లలే అని ఏం నమ్మకం?"

"ఎల్లా నమ్మించనూ, వాళ్ళు మీ పిల్లలే నని?"

"వాళ్ళ తలలమీద చేతులుంచి ప్రమాణంచేసి చెప్పు వాళ్ళు నా పిల్లలేనని."

వెంటనే పిల్లల్ని పిలిచి, వాళ్ళ తలలపైన చేతులుంచి, "వీళ్ళు మీ పిల్లలే" నని ప్రమాణం చేసింది.

"వాళ్ళు చస్తే నీకేంలెత్తూ?" అని అన్నాడు రామకృష్ణారావు కర్కశంగా. అప్పట్లో పద్మ హృదయం ముక్కలు ముక్కలుగా తరుక్కు పోయింది.

"మీరు క్రిందటి జన్మలో కసాయివాళ్ళు. మీ పాపం బద్దలై మీకు అంతకన్నా నికృష్టపు జన్మ వచ్చింది. క్రిందటి జన్మలో మీరు గొడ్లని కోశారు. ఈ జన్మలో మీరు మనుషుల్నే కోస్తున్నారు. ఇంతకన్నా నికృష్టపు జన్మ ప్రపంచంలో ఇంకొకటి ఉండబోదు" అని తాచుపాముకు మల్లే బుస్సున లేచింది తను.

అప్పట్లో తనకి అంత ధైర్యం ఎల్లా వచ్చిందో ఊహించలేకపోయింది పద్మ. పక్కమీద అటు దొర్లి ఇంకొక అర గంట గడిపింది. ఇంకొక గంట వ్యవధి మాత్రం వుంది. ఆ గంటలో తను చేయవలసిన పనులను గూర్చి ఆలోచించింది పద్మ. ఇల్లంతా ఒకమాటు చివరసారిగా కలయజూచిరావాలి. వెళ్ళేముందు దేవుడికి దండం పెట్టాలి. వీలయితే తను వెళ్ళిపోతున్న సంగతి తెలియజేస్తూ, రామకృష్ణారావుకి ఒక

ఉత్తరం వ్రాయాలి. ఉత్తరం వ్రాయడంలో కొంత కాల మైనా గడుస్తుందని కలమూ కాగితమూ తీసికొని ఉత్తరం వ్రాయడానికి పూనుకున్నది పద్మ.

"మిమ్మల్ని ఏమని సంబోధించాలో నాకేమీ తోచడం లేదు. మన శరీరాలు మాత్రమే కలుసుకొన్నాయి. మనసులు కలువలేదు. అందువల్ల మనము భార్యాభర్తలమని అనుకోవ డానికి వీలులేదు. అందుకోసం ఏ సంబోధన లేకుండానే ఉత్తరం ప్రారంభించాను. తెల్లవారు ఝామున నాలుగు గంటలకి మీరు అనుమానించిన వ్యక్తితోనే లేచిపోతున్నాను. ఇంత వరకూ నాకూ అతనికీ ఏమీ సంబంధం లేదు. ఎన్ని ప్రమా ణాలు చేసినా, మీకు ఆ విషయంలో నమ్మకం కుదరలేదు. చివ రికి పిల్లలమీద ఒట్టుపెట్టుకున్నా "వాళ్ళు చస్తే నీకేం లెక్ఖా" అని ఎగరగొట్టి వేశారు. ఇంక మీకూ నాకూ పొసగదని ఆనాడే నాకు తెలిసిపోయింది, అప్పటి నుంచీ పేరాజుని కలుసుకోవడానికి గట్టి ప్రయత్నం చేశాను. నా అదృష్టం బాగుండి, అతను నాకు కనపడ్డాడు. "నీతో వుండిపోతా" నంటే అతను ఎంతకి ఒప్పుకోలేదు. "నీ సంసారం పాడుచేయడం నాకు ఏ మాత్రం ఇష్టం లేదని" నన్ను ఎంతో వారించాడు. చివరికి కాళ్ళా వేళ్ళా పడి అతన్ని ఒప్పించాను. మీ అను మానాన్ని నేటికి నేను ధృవపర్చ గలుగుతున్నందుకు నే నెంతో సంతోషిస్తున్నాను. నిజం చెప్పాల్సివస్తే మీ మీద కసికొద్దీ నే నీ పనికి పూనుకుంటున్నాను. తన పిల్లలు చావాలని ఏ తల్లి కోరుకుంటుంది చెప్పండి? "వాళ్ళు చస్తే నీకేం లెక్ఖా" అని మీరన్ననాడే, నా మనస్సు పూర్తిగా విరిగింది. ఇంక మీతో నేను కాపురం చేయలేను. నా దారిని నేను వెళు

తున్నాను. మీ నగలన్నీ తీసి పెట్టెలో పెట్టాను. తాళపు చేతులు మీ నెత్తి దగ్గర పెడుతున్నాను. కట్టుగుడ్డలతో నేను యింట్లోంచి వెడుతున్నాను. వెళ్ళేముందు మీకు, విన్నా వినకపోయినా ఒక హితవు యివ్వదలచాను. నేను వెళ్ళిన తరువాత మీరు ఎల్లాగూ పెళ్ళి చేసుకోకమానరు. అందు వల్లనే ఈ హితవు చెప్పాల్సి వస్తున్నది. స్త్రీని నమ్మండి. ఆమెకీ ఒక వ్యక్తిత్వ ముందని గుర్తించండి. "నమ్మకం లేని వాడికి సుఖం తక్కువ" అనే లోకోక్తిని ఎప్పుడూ మరచి పోకండి. ప్రేమ యిచ్చి పుచ్చుకొనే వస్తువు. మీరు ఇతరులకి ప్రేమ యివ్వకపోతే మీకూ ప్రేమ లభించదు.

"మీకు మల్లెనే, నేనూ చదువుకున్నదాన్ని. మీకు మల్లెనే నాకూ అభిమానం వుంది. అభిమానం చంపుకొని బ్రతకడంకన్నా, అపనిందలపాలు కావడమే మేలని తోచి పేర్రాజుతో లేచిపోతున్నాను. ఆరు సంవత్సరాలనించీ మీ యింట్లో నేను ఎన్నో కష్టాలు అనుభవించాను. లేనిపోని అనుమానాలకి గురి అయినాను. ఇక యిప్పటినుంచీ ఆ అవ మానాలపాలు గావడం మీవంతు.— ఫలానివాడి పెళ్ళాం, ఎవడితోనో లేచిపోయిందంటే మీకు ఎల్లా వుంటుందో యిప్పుడు ఆలోచించండి.

"పిల్లల విషయంలో నేనేమి వ్రాయదలచుకోలేదు— చిన్నతనంలో పిల్లలు తల్లిపైన ఎక్కువగా ఆధారపడుతారు. ప్రస్తుతం వాళ్ళకి ఆ దశ దాటింది. ఆ దశ తరువాత వాళ్ళని పోషించేభారం పూర్తిగా తండ్రిదేనని, మీకు జ్ఞాపకం చేయ

వలసిన అవసరం లేదనుకుంటాను. వాళ్ళు మీ పిల్లలే గనక వాళ్ళని మీ దగ్గరే వదిలిపెడుతున్నాను.''

ఇట్లు,

పద్మ.

పద్మ ఉత్తరం ముగించేసరికి అరగంటదాటింది. నాలుగు గంటలకి యింకొక యిరవై నిమిషాలు మిగిలి వున్నాయి. ఉత్తరం మడతబెట్టి తాళపుచేతులూ, ఉత్తరం, భర్త తలగడ క్రింద పెట్టింది. ఎందుకో, ఒకమాటు యిల్లంతా కలయ జూచి రావాలని ఆమెకి తోచింది. వెంటనే బయల్దేరింది. గుండెలు దడదడ కొట్టుకోవడం ఆరంభించాయి. తనేమీ తప్పుచేయడం లేదుకద? అన్న అనుమానం వేసింది. ఇంతలోకే వంటయింట్లోకి వెళ్ళింది. గుండెదడ మరీ ఎక్కువైంది. భువనేశ్వరంలో ఎన్నో విగ్రహాలు వున్నాయి — ఆ విగ్రహాలన్నింటికి, సాష్టాంగపడింది. తన భర్త తనని హింసిస్తే తను తిరిగి అతన్ని హింసించడమెందుకు? అతన్ని అపనిందలపాలు చెయ్యడమెందుకు? కాగా తాను తప్పుదారి పట్టడమెందుకు? పగ దీర్చుకోవడానికి, తను పతనం పొందడందేనికి? నిజమే, జీవితంలో అన్యాయాన్ని సహించకూడదు. కాని అన్యాయాన్ని అన్యాయంతో ఎదుర్కొనడం ఎక్కడినైజం? పేర్రాజుతో లేచిపోవడానికి నిశ్చయించుకొని, తను ప్రస్తుతం ఎవరికి అన్యాయం చేస్తున్నట్లు? ఉద్రేకంలో తనకు తానే అన్యాయం చేసుకుంటున్నది. జీవితంలో చెరపడానికి వీలులేని మచ్చని, తనకు తాను కోరి తెచ్చుకుంటున్నదా? తను

పేర్రాజుతో లేచిపోతే తనకు ఒరిగే సుఖమేమిటి? తను భర్త యింట్లోంచి వెళ్ళిపోవడం, ముమ్మాటికి అవసరమే కాని ఎంత ఆలోచించినా పేర్రాజుతో లేచిపోవడం తను చేయదగ్గ పనికాదని తోచింది పద్మకి – పేర్రాజు తనకోసం నాలుగు గంటలకి వస్తాడు. వాకిలి గుమ్మందగ్గర ఎదురు చూస్తాడు. ఏం వస్తే? వస్తేరానీ – ఎదురు చూచి తన దారిని తాను వెళ్ళిపోతాడు. దానివల్ల జరిగే దేముంది? ఏమీలేదు – ఏ ఆరు గంటలకో తను ఇందిర దగ్గరకి వెళ్ళి కొద్దిగా డబ్బు చేబదులు తీసుకొని వరంగల్ తన పుట్టింటికి వెళ్ళితే ఎలా వుంటుంది? తను ఏ నీలాపనిందలు లేకుండా, ఈ క్లిష్టపరిస్థితుల్లోంచి బయటపడవచ్చు. తను యీ యింటి గుమ్మం తొక్కకుండా వుండడమే తనకు కావల్సింది. అప్పుడు నిజంగా తన పంతం నెగ్గుతుంది. కాగా పిల్లల్ని కూడా ఇక్కడే వదిలి వేయడం మంచిది. ఈ భావం కలగడంతోనే పద్మ రామ కృష్ణారావు తలగడ క్రింద పెట్టిన ఉత్తరాల్ని, తన గదిలోకి తీసుకువచ్చి చింపేసింది. ఆ పని చేయడంతోనే, ఎందుకో పద్మ మనస్సు కుదుటపడింది. చెప్పరాని సంతోషం కలిగింది. వెళ్ళి పక్కమీద పడుకుంది, పిల్లల్ని దగ్గరికితీసుకుంది. నిద్రపట్టలేదు. కాని మనస్సుకు ఎంతో హాయి అనిపించింది. ఎప్పుడు నాలుగు గంట లైందో ఆమెకు తెలియదు. పేర్రాజు ఆమెకోసం ఎంతసేపు కాచుకు కూర్చున్నాడో అంతకన్నా తెలియదు.

పద్మ ఆరుగంటలకి లేచింది–తనకి జ్ఞానోదయం కలిగించినందుకు, భువనేశ్వరం దగ్గరికి వెళ్ళి తిరిగి ఇంకొకసారి మొక్కిల్లింది. పడకగదిలోకి వచ్చి, పిల్లల్ని తేలికగా ముద్దు పెట్టు

కుంది. చేతిసంచి పట్టుకొని వాకిలి గుమ్మంతీసి, చరచరా ఇందిర ఇంటికి నడిచివెళ్ళింది. దారి పొడుగునా ఏదైనా ఉద్యోగం చూసుకోవాలి. స్వతంత్ర జీవనం గడపాలి. అనే ఆలోచన వచ్చింది పద్మకి.

రామకృష్ణారావు ఉదయం ఏడుగండలకు లేచి పద్మ కోసం, యిల్లంతా వెతికాడు. ఎక్కడా పద్మ కనపడలేదు— ఎందుకో అతనిగుండె అమాంతంగా జారిపోయింది. "పద్మ పేర్రాజుతో లేచి పోలేదుకద?" "ఏమో?" ... "ఏ నూతి లోనో పడలేదుకద?"... "ఏమో"...పిల్లలు లేచి, తల్లి కనబడకపోవడంతో, ఆమెకోసం ఏడవడం మొదలెట్టారు. ఆ ఏడ్పులుమాత్రం, రామకృష్ణారావు హృదయంలో బల్లెం పోటుల్లా గుచ్చుకున్నాయి.

★